సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023

I



డిపాజిట్ గల్లంతు

ఎన్నికల్లో పోటీ చేసిన చాలామందికి డిపాజిట్ దక్కకుండా పోతోంది. ఓటర్లను ఆకట్టుకోలేకపోవడంతో ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఓట్లు రాక ధరావత్ గల్లంతవుతోంది. IIలో▸



వెలమల క్షేత్రం..!

మంచిర్యాల శాసనసభ నియోజకవర్గం వెలమలకు కంచుకోటగా ఉంటూ వస్తోంది. పునర్విభజనకు ముందు లక్సెట్టిపేట నియోజకవర్గంలోనూ వారికే అధికారం దక్కింది. IVలో▸

గరిష్టం/కనిష్టం 33.0 /23.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

బీసీ లీడర్ల వెనుకడుగు!

- బీఆర్ఎస్, కాంగ్రెస్ టికెట్ల ప్రకటనతో సైలెంట్
- బీజేపీ ఇస్తుందంటున్న ఆ పార్టీ ఆశావహులు
- రాకపోతే ఉమ్మడి బీసీ అభ్యర్థిగా పోటీ చేయిస్తారా?
- ఈ ఎన్నికల్లోనూ నాయకులకు తప్పని భంగపాటు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించిన బీసీ నాయకులంతా వెనక్కి తగ్గారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి టికెట్ ఆశించిన వారంతా ప్రస్తుతం సైలెంట్ అయ్యారు. జిల్లాలో ఉన్న ఏకైక జనరల్ సీటు మంచిర్యాలను బీసీలకు ఇవ్వాలని గత కొంతకాలంగా బీసీ సంఘాలు, నాయకులు పట్టుపట్టారు. ఇందుకోసం జిల్లా కేంద్రంగా పలు రాజకీయ కార్యక్రమాలు చేపట్టారు. బైక్ర్యాలీలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, దీక్షలు జరిగాయి. రాజ్యాధికార సాధన సమితి పేరుతో టికెట్ ఆశావహులు ఈ విషయంపై ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు గోనే ప్రకాశ్‌రావు, అరవింద్‌రెడ్డి మొదట మద్దతు తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీలు పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వలేదు. ప్రధాన పార్టీగా ఉన్న బీజేపీ అభ్యర్థి పేరు వెల్లడి కాలేదు. ఆ పార్టీలో పోటీ చేసే వారి కోసం నియోజకవర్గం నుంచి ఇద్దరి పేర్లు పరిశీలన చేశారు. రేపో, మాపో అధికారింగా జాబితా వెల్లడి కానుంది. అధికార, విపక్ష రెండు ప్రధాన పార్టీలు బీసీలను విస్మరించడంతో చివరగా బీజేపీపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఎన్నికల ముందే బీసీ నినాదం

జనాభా పరంగా అధికంగా ఉన్నామని చెప్పే బీసీ నాయకులు ఎన్నికలకు ముందే టికెట్ కోసం పోరాటం చేయడం పరిపాటిగా మారింది. 'బీసీ టికెట్' కేవలం ఎన్నికల ముందు నినాదంగానే మారిపోయిందనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల తర్వాత ఆ ఊసే ఉండడం లేదనే అభిప్రాయాలు వస్తున్నాయి. మంచిర్యాల నియోజకవర్గంలో పూర్వం నుంచి ఓసీలకే ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసే అవకాశం కలుగుతోంది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉన్నప్పటికీ బెల్లంపల్లి, చెన్నూరు ఎస్సీ కాగా, ఖానాపూర్ ఎస్టీ, మంచిర్యాల మాత్రమే జనరల్ రిజర్వుగా ఉన్నాయి. జనరల్‌లో అందరూ పోటీ చేసే అవకాశం ఉంటుంది. బీసీ జనాభా అధికంగా ఉన్నామని చెబుతూ పలువురు నాయకులు టికెట్ కోసం పోటీకి పడ్డారు. మంచిర్యాల నియోజకవర్గంలో మున్నూరు కాపు, పెరిక, పద్మశాలీ, యాదవ, గౌడ, ముదిరాజ్, ఇతర కులాల జనాభా అధికంగా ఉంది. ఈ కులాల నుంచే ఎవరికైనా అవకాశం ఇవ్వాలని డిమాండ్లు వచ్చినప్పటికీ ఎవరికీ టికెట్ దక్కకపోవడంతో ఎవరికి వారు పక్కకు జరిగి తమ పార్టీలో పని చేసుకుంటున్నారు.

పోటీ చేసే ధైర్యం చేస్తారా?

బీజేపీ అభ్యర్థుల ప్రకటన వరకు వేచి చూసి ఈ పార్టీ కూడా బీసీలకు అవకాశం ఇవ్వకపోతే బీసీ రాజ్యాధికార సాధన సమితి నుంచి ఉమ్మడి అభ్యర్థిగా బీసీ నుంచి బరిలో దింపుతామని నాయకులు అంటున్నారు. ప్రసు త అభ్యర్థుల పోటీలో తట్టుకుని స్వతంత్రంగా లేక ప్రధాన పార్టీలు కాకుండా మరో పార్టీ నుంచి పోటీ చేసే సాహసం చేస్తారా? అనే చర్చ సాగుతోంది. ఈ ఎన్నికల్లో కొందరు ఎలాగైనా పోటీ చేసేందుకు ధైర్యం చూపుతున్నారు. మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్లు గాజుల ముఖేశ్‌గౌడ్, తోట శ్రీని వాస్ సిద్ధం అవుతున్నారు. తోట శ్రీనివాస్ బీఆర్ఎస్‌ను వీడి బీఎస్పీలో చేరారు. వీరి ద్దరు మాత్రం తప్పనిసరిగా పోటీలో ఉంటా మని అంటున్నారు. ప్రధాన పార్టీల ఓసీ అభ్యర్థులను తట్టుకుని ఎలా నిలబడతారనేదే పెద్ద సవాల్‌గా మారింది.

ఆ నలుగురు

- తొమ్మిది పర్యాయాలు అసెంబ్లీకి ఎన్నిక
- ఉప ముఖ్యమంత్రిగా, మంత్రులుగా పదవులు
- ఇదీ దండేపల్లి మండల నేతల ఘనత

దండేపల్లి: మండల నాయకులు నలుగురు తొమ్మిది పర్యాయాలు ఎమ్మెల్యేలుగా ఎన్నికై రాజకీయంగా చరిత్రకెక్కారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రులుగా పని చేసి మండలానికి వన్నె తెచ్చారు. 2004లో జరిగిన అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు ముందు లక్సెట్టిపేట నియోజకవర్గంగా ఉండేది. అప్పటి లక్సెట్టిపేట నియోజకవర్గంలో దండేపల్లి మండలానికి ప్రత్యేక స్థానం ఉంది. మండలంలోని ధర్మరావుపేటకు చెందిన జేవీ.నర్సింగరావు, కొర్విచెల్మ(రాజంపేట)కు చెందిన జీవీ సుధాకర్‌రావు, కన్నెపల్లికి చెందిన చుంచు లక్ష్మయ్య అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మండలంలోని లింగాపూర్‌కు చెందిన అజ్మీర గోవింద్‌నాయక్ ఖానాపూర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన గోవిందనాయక్

దండేపల్లి మండలం నుంచి అసెంబ్లీకి ఎన్నికైన నాలుగో వ్యక్తి గోవిందనాయక్. మండలంలోని లింగాపూర్ గ్రామం. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఖానాపూర్ నియోజకవర్గం నుంచి 1985లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యే బరిలో నిలిచి గెలుపొందారు. 1994లో టీడీపీ, 2004లో టీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వయస్సు పైబడడంతో ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటూ, లింగాపూర్‌లో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు.


గోవిందనాయక్

ముక్కుసూటి మనిషి జీవీ..

మండలంలోని కొర్విచెల్మ(రాజంపేట) గ్రామానికి చెందిన మాజీ మంత్రి జీవీ సుధాకర్‌రావు ముక్కుసూటి మనిషి, పట్టుదలకు మారు పేరున్న వ్యక్తిగా పేరు గడించారు. సరస్వతి కాలువ నిర్మాతగా కూడా పేరు గడించారు. ఒకసారి శాసనమండలి సభ్యుడి(ఎమ్మెల్సీ)గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్ర మంత్రిగా పని చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్ శాఖల అధ్యక్షుడిగా పనిచేస్తూ 1977లో మొదటిసారిగా శాసనమండలికి ఎన్నికయ్యారు. మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసి సరస్వతి కాలువ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. 1983లో జరిగిన ఎన్నికల్లో ఓటమి చెంది 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఎన్నికయ్యారు. 1989లో మళ్లీ ఎన్నికై చెన్నారెడ్డి మంత్రివర్గంలో రోడ్లు, రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు. 2002 డిసెంబరు 30న హైదరాబాద్‌లో మరణించారు.


జీవీ సుధాకర్‌రావు

విద్యుత్ ఆరాధ్యుడు జేవీ..

మండలంలోని ధర్మరావుపేటకు చెందిన జేవీ నర్సింగరావు 1967–72 కాలంలో రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. న్యాయవాదిగా హైదరాబాద్ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తూ 1957లో అక్కడి బేగంబజార్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీచేసి గెలుపొందారు. నీలం సంజీవరెడ్డి కేబినెట్‌లో నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత సొంత నియోజకవర్గం లక్సెట్టిపేటలో 1967లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గె లుపొందారు. ఈ సమయంలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రిగా పనిచేశారు. 1972లో కూడా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. పీసీసీ అధ్యక్షుడిగా, విద్యుత్ బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. విద్యుత్ శక్తి బోర్డు చైర్మన్‌గా పనిచేసిన కాలంలో జిల్లాలో విద్యుత్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. కడెం ప్రాజెక్టు నిర్మాణంలోనూ ప్రముఖ పాత్ర పోషించారు. 1972 సెప్టెంబర్ 4న అంతిమ శ్వాస విడిచారు.


జేవీ నర్సింగరావు

బీసీ నేతగా లక్ష్మయ్య..

మండలం నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టిన మూడో వ్యక్తి చుంచు లక్ష్మయ్య. కన్నెపల్లికి చెందిన లక్ష్మయ్య రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 1967 అసెంబ్లీ ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి గెలుపొందారు. బీసీల ఆశాజ్యోతిగా పేరొందారు. ఎమ్మెల్యే పదవీ కాలం అనంతరం లక్సెట్టిపేట కోర్టులో, హైదరాబాద్ హైకోర్టులో ప్రాక్టీసు చేశారు. 2007లో హైదరాబాద్ నుంచి స్వగ్రామం కన్నెపల్లికి వచ్చారు. సదానందహరి ఆలయంలో కొద్దిరోజులు ఆధ్యాత్మిక జీవనం గడుపుతూ అనారోగ్యంతో 2008 మే 1న మరణించారు.


చుంచు లక్ష్మయ్య



న్యూస్‌రీల్

ఆర్టీసీ కార్మికుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీలో కార్మికులపై వేధింపులకు నిరసనగా టీఎస్ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. అక్రమ బదిలీ, సస్పెన్షన్లు నిలిపివేయాలని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల పట్ల అధికారులు, సూపర్‌వైజర్ల వైఖరి మారాలని అన్నారు. ఆత్మహత్యలు కాదు.. ఆత్మస్థైర్యంతో పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈయూ కార్యదర్శి గోలి శంకర్, రీజినల్ అసిస్టెంట్ సెక్రెటరీ బోట్టు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతి

మంచిర్యాలఅర్బన్: దసరా పండుగ సందర్భంగా ఈ నెల 18నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి లక్కీ డ్రాలో బహుమతులు గెలుచుకోవచ్చని మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. ప్రయాణం చేసిన టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబరు రాసి బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన లక్కీడ్రా బాక్స్‌లో వేయాలని పేర్కొన్నారు. ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఐదుగురు మహిళలు, పురుషులు లక్కీడ్రాలో గెలుపొందే అవకాశం ఉందని తెలిపారు.

'బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వండి'


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్, నాయకులు


నస్పూర్: మంచిర్యాల ఎమ్మెల్యేగా బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా ఎన్నికల ఇంచార్జి, మహారాష్ట్ర రాలేగావ్ ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ రాంజీ ఉయికె కోరారు. గురువారం నస్పూర్‌లోని ఫ్లడ్‌కాలనీ, సెవెన్ హిల్స్ కాలనీల్లో గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. బీజేపీకి అవకాశం కల్పిస్తే మంచిర్యాలను స్మార్ట్ సిటీగా మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆనందకృష్ణ, పెద్దపల్లి ఎస్సీ మోర్చా పార్లమెంటు కన్వీనర్ మధు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ వెంకటేశ్, నాయకులు శ్రీనివాస్, పాషా, తిరుపతి, సత్యనారాయణ, సాగర్, మహేశ్, రాయమల్లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


బట్టల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

పాతమంచిర్యాల: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ జోన్ తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కే.విజయసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు షాపింగ్‌మాల్స్‌లో గురువారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని మూడు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ వస్త్రాల ప్యాకింగ్‌లపై సరైన ధర, ప్యాకింగ్ చేసిన తేదీ, ఎక్స్‌పైరీ తేదీ, తయారీదారుల అడ్రస్‌లు, కస్టమర్‌కేర్ సెల్ నంబర్లు లేని కారణంగా కేసులు నమోదు చేశామని తెలిపారు. ప్రతీ వస్తువుపై తయారీ తేదీ, మన్నిక, కస్టమర్‌కేర్ ముద్రించి ఉన్న వస్త్రాలు మాత్రమే అమ్మాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కే.విశ్వేశ్వర్, సహాయక తూనికలు, కొలతల అధికారి శంకర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మృతుల పేర్లు


ఓటరు జాబితాలో చనిపోయిన వ్యక్తి పేరు

దండేపల్లి: కొత్త ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణ అనంతరం ఎన్నికల సంఘం ఈ నెల 4న తుది ఓటరు జాబితాను ప్రకటించింది. దీని ప్రకారమే నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. మండలంలో 49 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 39,719 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు తుది జాబితాలోనూ అక్కడక్కడ కొన్ని తప్పులు దొర్లినట్లు కనిపిస్తున్నాయి. ఐదారేళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లూ ఓటరు జాబితాలో దర్శనమిస్తున్నాయి. మృతులు సిరికొండ మల్లయ్య తండ్రి రాజం, బండారి వెంకన్న మల్లయ్య పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని సంప్రదించగా, డెత్ సర్టిఫికెట్ లేని వాటిని తొలగించకపోవచ్చని, అలాంటివి ఉంటే పోలింగ్ రోజు ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది, పోలింగ్ ఏజెంట్లకు వివరాలు అందిస్తామని తెలిపారు.

ఏరియా ఆస్పత్రి ఎత్తివేత విరమించుకోవాలి



మాట్లాడుతున్న మల్లేష్

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎత్తివేత ప్రయత్నాలను యాజమాన్యం విరమించుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం ఏరియా ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులు రావడం లేదని యాజమాన్యం తప్పుడు ప్రచారం చేస్తూ వార్డులు మూసివేసి భవిష్యత్‌లో ఒకే వార్డుతో ఆస్పత్రి నిర్వహించాలనే తలంపులో ఉందని విమర్శించారు. రోగులను అడ్మిట్ చేసుకోకుండా వెనక్కి పంపించేస్తున్నారని తెలిపారు. గైనకాలజిస్ట్ వచ్చి ఆరు నెలలు కావస్తుండగా మూడు నెలలు సెలవు తీసుకుందని, మిగతా మూడు నెలల్లో ఏ ఒక్క కేసునూ అడ్మిట్ చేసుకోలేదని పేర్కొన్నారు. అన్ని సౌకర్యాలు ఉన్నా రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి గర్భిణులను రెఫర్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సింగరేణి విభాగం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బి.వెంకటస్వామి, సీనియర్ నాయకుడు చిప్పనర్సయ్య, ఏరియా ఆసుపత్రి పిట్ సెక్రెటరీ డీఆర్ శ్రీధర్, సహాయ కార్యదర్శి పుట్ట శ్రీనివాస్, నాయకులు రాజమౌళి, ఉపేందర్, శంకర్, ఐలయ్య, రాజం, రాజేష్, పద్మ, నాగరత్నం, పోశం పాల్గొన్నారు.

కలప డిపో ఎత్తివేత


భీమారంలోని ప్రభుత్వ కలప డిపో

- ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు
- నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు

భీమారం: కలప అమ్మకాల్లో ఓ వెలుగు వెలిగిన భీమారంలోని అటవీశాఖ కలప డిపో ఎత్తివేతకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 1986 ప్రాంతంలో మంచిర్యాల అటవీ డివిజన్‌లోని భీమారంలో ప్రభుత్వం అటవీశాఖ ద్వారా కలప డిపో ఏర్పాటు చేసింది. చెన్నూరు, కోటపల్లి, బెల్లంపల్లి, వేమనపల్లి ప్రాంతాల్లోని టేకు ప్లాంటేషన్‌లను తొలగించి ఈ డిపోకు తరలించేవారు. ప్రజల అవసరాల కోసం ప్రతీ నెల వేలం పాటలు నిర్వహించి లక్షలాది రూపాయల విలువైన కలప విక్రయించేవారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పేరుగాంచిన భీమారం, జన్నారం డిపోల్లో హైదరాబాద్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున కాంట్రాక్టర్లు వచ్చి కలప కొనుగోలు చేసేవారు. గత 15ఏళ్ల నుంచి ఆశించిన స్థాయిలో కలప రాకపోవడంతో డిపో సిబ్బందిని ఉన్నతాధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. భీమారం అటవీ ప్రాంతానికి బాధ్యుడుగా ఉన్న సెక్షన్ ఆఫీసర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో పట్టుబడిన కలపను డిపోకు తరలించి వేలంపాట నిర్వహించేవారు. గతంలో 20వేల మీటర్ల కలపని విక్రయించిన అటవీశాఖ ప్రస్తుతం తక్కువ స్థాయిలోనే వేలంపాట నిర్వహిస్తోంది. డిపోలో కొనుగోలు చేసిన కలప కన్నా హమాలీ, రవాణా ఖర్చులు అధికం కావడంతో కొన్ని నెలలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కలప కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదు.

పట్టుపడ్డ వాహనాలు ఇక్కడికే..

జిల్లా వ్యాప్తంగా విలువైన టేకు కలప రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను అధికారులు ఈ డిపోకే తరలిస్తున్నారు. దాదాపు 20 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ డిపోలో పార్కింగ్‌కు ఇబ్బంది ఉండదని ఇక్కడికి తరలిస్తుండగా.. ఇప్పటికే వాహనాలను వేలం పాట ద్వారా స్క్రాప్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇంకా సుమారు 100 వాహనాలు అమ్మకానికి ఉన్నాయి. డిపో తరలించేందుకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి అటవీశాఖ అధికారులకు ఉత్తర్వులు అందాయి. భీమారం నుంచి దాదాపు 100 కిలోమీటర్ల దూరంలోని జన్నారానికి ఇక్కడి టేకు కలప తరలించేందుకు ఎంత ఖర్చవుతుందనేది అంచనా వేస్తున్నారు. కాగా డిపో ఎత్తివేత విషయమై భీమారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ సర్కార్‌ను సంప్రదించగా.. డిపో ఎత్తివేసి కలప తరలించేందుకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయని, ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని తెలిపారు.

నిజాలు తెలియజేసే బాధ్యత వారియర్స్‌దే..!


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య, పక్కన ఎంపీ వెంకటేష్ నేత

- పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత
- సోషల్ మీడియా వారియర్స్ సమావేశం

బెల్లంపల్లి: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత సోషల్ మీడియా వారియర్స్‌పై ఉందని పెద్దపల్లి ఎంపీ, బెల్లంపల్లి బీఆర్ఎస్ ఎన్నికల క్యాంపెయిన్ ఇంచార్జి బోర్లకుంట వెంకటేష్ నేత, బెల్లంపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లిలోని ఏఆర్ కన్వెన్షన్ హాల్‌లో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో అనేక సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్నారని, విపక్ష పార్టీ లు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ మరింత బాధ్యతగా పని చేయాలని, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి సరైన అవగాహన కల్పించాలని దిశా నిర్దేశం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని దుర్గం చిన్నయ్య అన్నారు. పదవుల కోసం డబ్బు సంచులతో వచ్చే స్థానికేతరులను ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ సోషల్‌మీడియా రాష్ట్ర కన్వీనర్ విజయ్ ఆనంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

కోవర్టులు ఎవరో..?

- మూడు ప్రధాన పార్టీల్లోనూ చేరికలు
- కండువాలు మారుస్తున్న నాయకులు
- ఎన్నికల్లో ఏ మేరకు పనిచేస్తారో..!

మంచిర్యాలటౌన్: అసెంబ్లీ ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో చేరికలు ఊపందుకున్నాయి. సామాన్య కార్యకర్తల నుంచి పార్టీలో వివిధ హోదాల్లో పని చేస్తున్న వారు, ప్రజాప్రతినిధుల వరకు పార్టీ మారుతున్నారు. కొందరు ఉదయం ఒక పార్టీలో చేరి సాయంత్రానికి మరోపార్టీ కండువా కప్పుకుని ఆశ్చర్యపరుస్తున్నారు. పోటాపోటీ చేరికలతో గెలుపు కోసం ఎవరు కృషి చేస్తారు, ఎవరు కోవర్టులు అనేది తేల్చుకోలేని సందిగ్ధత ఏర్పడుతోంది. అభ్యర్థులు, నాయకులు ప్రచారం చేస్తూనే పార్టీలో క్యాడర్‌ను పెంచుకునేందుకు ఇతర పార్టీల్లోని ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులను చేర్చుకుంటున్నారు. ఒక మండలానికి చెందిన వారిని ఒక పార్టీలో చేర్చుకుంటే, అదే పార్టీ, అదే మండలానికి చెందిన వారిని మరో పార్టీవారు చేర్చుకుంటున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు వేరే పార్టీలోకి తమ వారిని పంపి కోవర్టులను ఏర్పాటు చేసుకుంటున్నారు. వారు అన్ని విషయాలను తెలుసుకుంటూ తమ వారికి చేరవేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రచారంలో ప్రజలు నిలదీస్తున్న, ప్రశ్నిస్తున్న ఘటనలు ఎదురైనప్పుడు వీడియోలు బయటకు వస్తున్నాయి. కోవర్టుల వల్లే అవి ప్రత్యర్థులకు చేరుతున్నాయని అనుమానిస్తున్నారు. ఆ వీడియోలతో వ్యతిరేక ప్రచారం చేయడంతో తలపట్టుకుంటున్నారు. దీంతో పార్టీలో చేరే వారిలో ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదోననే అయోమయంలో పడిపోతున్నారు. ప్రత్యర్థి వ్యూహం తెలుసుకునేందుకు అన్ని పార్టీలు అనుసరిస్తున్న విధానం ఇదే కాగా, ఎన్నికలు పూర్తయ్యే వరకు ఈ కోవర్టుల వల్ల ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎంత మేరకు నష్టం జరుగుతుందో తెలియని పరిస్థితి. అందరినీ నమ్ముతున్నట్లుగా ప్రవర్తిస్తూనే ప్రతీ విషయాన్ని రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నా రు. 'ప్రతీ ఓటు కీలకం. ఎవరిని ఏమి అనలేం. ఎవరిని దూరం చేసుకోలేం. పార్టీలో చేరే వారిని నమ్మక తప్పని పరిస్థితి..' అని ఓ నాయకుడు అభిప్రాయం వ్యక్తం చేశారు.

'ప్రభుత్వ భూముల పరిరక్షణలో విఫలం'


మాట్లాడుతున్న మధుసూధన్‌రావు

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించడంలో జిల్లా ఉన్నతాధికారులు విఫలమయ్యారని స్వచ్ఛంద పౌర సేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి తులా మధుసూదన్‌రావు తెలిపారు. గురువారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నస్పూర్ శివారు సర్వేనంబరు 42లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా జిల్లా ఉన్నత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించలేని అధికారులు ఎన్నికలు నిష్పక్షపాతంగా ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. జిల్లా ఉన్నత అధికారులపై త్వరలోనే చీఫ్ ఎలక్షన్ కమిషన్, డీఓపీటీ(డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్) అధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. టీఎస్‌జీఓలకు కేటాయించిన స్థలంలో అనేక మంది బినామీలు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు బల్ల శివశంకర్, నాయకులు నరెడ్ల శ్రీనివాస్, విజయ్‌కుమార్, సురిమిల్ల నవీన్, కిరణ్, బన్ని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

51 మంది బైండోవర్



కెరమెరి: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మండలంలోని గ్రామాలకు చెందిన 51 మంది నేరస్తులను తహసీల్దార్ ఎదుట గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. వివిధ కేసుల్లో ఉన్నవారితో పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలన్నారు. గొడవలు, ఘర్షణలు, అల్లర్లకు దిగితే రూ.లక్ష జరిమానాతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు



మంటలార్పుతున్న సిబ్బంది

మందమర్రిరూరల్: మందమర్రిలోని సింగరేణి క్వార్టర్ రెండోజోన్‌లో గురువారం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. పిండి వంటలు చేస్తుండగా గ్యాస్ లీక్ అయి మంటలు వ్యాప్తి చెంది టీవీ, కూలర్, సామగ్రి కాలిపోయిందని బాధితురాలు తెలిపింది. సమాచారం అందుకున్న సింగరేణి అధికారులు.. విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

సమ్మె జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట: సింగరేణి వ్యాప్తంగా ఈనెల 21న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య కోరారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణికి వచ్చిన లాభాలను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. లేకపోతే సమ్మె యథాతథంగా నిర్వహిస్తామన్నారు. బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, నాయకులు దాసరి తిరుపతిగౌడ్, నాగేశ్వరరావు, గొల్ల శ్రీనివాస్, రాజేందర్, రత్నం అయిలయ్య, లింగయ్య ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

పెంబి: మండలంలోని పెంబితండా, ఇటిక్యాల్ తండా గ్రామాల్లో ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ గంగారెడ్డి, నిర్మల్ ఎక్సైజ్ ఎస్సై రవికుమార్, పెంబి ఎస్సై రజినీకాంత్ గురువారం దాడులు నిర్వహించారు. పులియబెట్టిన 1800 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. పెంబితండాకు చెందిన అంగోత్ రాజేందర్, రాథోడ్ జ్యోతి, ఇటిక్యాల్ తండాకు చెందిన సపావత్ జూలీబాయిను అదుపులో తీసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వారిని బైండోవర్ చేశారు.

డిపాజిట్ గల్లంతు..!

- ఓట్లు రాలక దక్కని ధరావత్



ఎన్నికల్లో పోటీ చేయాలంటే డిపాజిట్ చెల్లించాల్సిందే. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారు రూ.5వేలు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఆయా నియోజకవర్గాల్లో పోలైన ఓట్లలో 1/6శాతం ఓట్లు సాధిస్తే డిపాజిట్ దక్కుతుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2014 శాసనసభ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి మొత్తంగా 107 మంది పోటీ చేయగా 80మంది డిపాజిట్ కోల్పోయారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 123 మంది పోటీ చేయగా వారిలో వంద మంది డిపాజిట్ గల్లంతైంది.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

గత ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	2014 ఎన్నికలు	2018 ఎన్నికలు
సిర్పూర్	1752	1579
చెన్నూర్	1609	2135
బెల్లంపల్లి	769	2598
మంచిర్యాల	1472	1394
ఆసిఫాబాద్	2829	2715
ఖానాపూర్	2421	2776
ఆదిలాబాద్	850	1149
బోథ్	2242	2275
నిర్మల్	1360	1367
ముథోల్	1791	2266

గత ఎన్నికల్లో పోటీ చేసిన, డిపాజిట్లు కోల్పోయిన వారు

నియోజకవర్గం	2014లో పోటీచేసిన వారు	డిపాజిట్ దక్కనివారు	2018లో పోటీ చేసిన వారు	డిపాజిట్ దక్కనివారు
సిర్పూర్	11	8	12	10
చెన్నూర్	15	13	14	12
బెల్లంపల్లి	21	19	13	11
మంచిర్యాల	13	11	21	19
ఆసిఫాబాద్	8	5	10	8
ఖానాపూర్	6	3	12	10
ఆదిలాబాద్	15	12	14	11
బోథ్	5	2	7	4
నిర్మల్	7	4	8	6
ముథోల్	6	3	12	9

చెల్లని ఓట్లు



ఎన్నికల్లో ఈవీఎంల వినియోగం కారణంగా చెల్లని ఓట్లకు చెక్ పడింది. కానీ పోస్టల్ బ్యాలెట్లలో ఓట్లు చెల్లకుండా పోవడం కొనసాగుతూనే ఉంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, సర్వీసు ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. అభ్యర్థి గుర్తుకు ఎదురుగా వేయకపోవడమో.. ఇద్దరు గుర్తులపై వేయడమో చేస్తే చెల్లని ఓటుగా పరిగణిస్తారు. 2014 శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 12,420 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వీటిలో 2,429 ఓట్లు చెల్లకుండా పోయాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో 8,502 పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వీటిలో 698 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లని ఓట్లుగా గుర్తించారు. వీటిలో సిర్పూర్ నియోజకవర్గంలో 32, చెన్నూర్‌లో 15, బెల్లంపల్లిలో 25, మంచిర్యాలలో 151, ఆసిఫాబాద్‌లో 72, ఖానాపూర్‌లో 53, ఆదిలాబాద్‌లో 94, బోథ్‌లో 44, నిర్మల్‌లో 164, ముథోల్‌లో 48 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లకుండా పోయాయి. విద్యావంతులైన వారి ఓట్లే చెల్లకుండా పోవడం గమనార్హం.

ప్రచార అనుమతులకు 'సువిధ'



సువిధ పోర్టల్

నిర్మల్‌ఖిల్లా: ఓటు నమోదు నుంచి అభ్యర్థుల నామినేషన్ వరకు ప్రతీ ఎన్నికల ప్రక్రియను సులభతరం చేసేలా ప్రత్యేక యాప్‌లు, పోర్టల్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. ఆండ్రాయిడ్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో వివిధ అనుమతుల కోసం దరఖాస్తు సమర్పించవచ్చు. ఇవి గతంలో ఉన్నప్పటికీ తగిన ప్రచారం లేక, ఎవరూ వినియోగించకపోవడం వల్ల అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. ఎన్నికల సంఘం ఈసారి అన్ని యాప్‌లపై విస్తృత ప్రచారం కల్పిస్తోంది. జిల్లాలో రాజకీయ పార్టీల ప్రదర్శనలు, ర్యాలీలు, ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ పోర్టల్ గురించి తెలుసుకుందాం.

దరఖాస్తులు పరిశీలించాకే..

సభలు, సమావేశాల నిర్వహణ, ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రచార వాహన అనుమతి, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు, లౌడ్‌స్పీకర్ల వినియోగం తదితర గురించి దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇవి పరిశీలన అనంతరం జిల్లా అధికారులు అనుమతులు జారీ చేస్తారు.

'నోటా'కేశారు..!

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిది. సరైన నాయకులను ప్రజాప్రతినిధులుగా చట్టసభలకు ఎన్నుకోవడంలో సామాన్యులకు కీలకమైనది. కానీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అందరికీ ఆమోదయోగ్యులైన వారై ఉండాలని ఏమీ లేదు. గతంలో నచ్చని అభ్యర్థులు బరిలో ఉన్నా ఎవరికో ఒకరికి ఓటు వేయాల్సి వచ్చేది. మరికొందరు ఓటింగ్‌కు దూరంగా ఉండేవారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఈవీఎం బ్యాలెట్లలో నోటా(నన్ ఆఫ్ ద ఎబోవ్) బటన్ తీసుకొచ్చారు. ఇది కేవలం ఓటరుకు ఐచ్ఛికం మాత్రమే. అభ్యర్థులు ఎవరూ సరైన వారు లేరని భావిస్తే నోటాకు ఓటు వేయొచ్చు. అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయదు. అత్యధికులు నోటాను వినియోగంచుకున్నా పోలైన ఓట్లలో మెజార్టీ ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. 2014 శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో 17,095 మంది ఓటర్లు నోటా బటన్ నొక్కారు. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20,254 ఓట్లు నోటాకు పోలయ్యాయి. అభ్యర్థులు, పార్టీలపై అసంతృప్తే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎలా వచ్చిందంటే..

2013లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆధారంగా నోటాను ప్రవేశపెట్టారు. దీన్ని భావ వ్యక్తీకరణలో అంతర్భాగంగానే పరిగణించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. తొలిసారిగా ఢిల్లీ, మిజోరాం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 2013 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో నోటా ఐచ్ఛికాన్ని ప్రవేశపెట్టారు. అన్ని గుర్తుల



కంటే చివరలో నోటా గుర్తు ఉంటుంది. ఈ గుర్తును అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సంస్థ రూపొందించింది.

రూ.50వేలు దాటితే ఆధారాలు చూపాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- జిల్లాలో రూ.1,48,37,086 నగదు సీజ్



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. మోడల్ కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలోని చెక్‌పోస్టులను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి రావడంతో నగదు, మద్యం, ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ మొత్తంలో నగదు, బంగారం, ఇతర వస్తువులు తీసుకెళ్లేవారు ఆధారాలు చూపాలని తెలిపారు. లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ.3,97,528 విలువ చేసే 690 లీటర్ల మద్యం, రూ.1,48,47,086 నగదు, 182 మొబైల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు వివరించారు. రౌడీ షీట్, సస్పెక్ట్ షీట్, 703 మందిని ఇప్పటికే బైండోవర్ చేసినట్లు తెలిపాడు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షపాతంగా జరిగే విధంగా పోలీసు శాఖ పనిచేస్తుందని స్పష్టం చేశారు.

కోలిండియా స్థాయిలో రాణించాలి



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: కంపెనీ క్రీడాకారులు కోలిండియా స్థాయిలో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో సింగరేణి స్థాయి హాకీ పోటీలను గురువారం ప్రారంభించారు. ముందుగా జీఎం క్రీడా పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడానైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. ఆటలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ పోటీల్లో ఆరు జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో జీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా ఎస్ఓటూజీఎం రఘుకుమార్, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాలకుర్తి రాజు, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్, హాకీ కెప్టెన్ తిరుపతి పాల్గొన్నారు.

మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణ



నారాయణను సన్మానిస్తున్న నాయకులు

వాంకిడి: మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని లంజన్‌వీరాకు చెందిన గుర్నులె నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం భాగ్యనగ్‌లోని జ్ఞాన మందిరంలో సంఘ సమావేశంలో ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన లెండుగూరె శ్యాంరావును కొన్ని అనివార్య కారణాలతో తొలగిస్తున్నట్లు తీర్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న నారాయణను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ మాలీల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఆదె వసంత్ రావు, నాయకులు శంకర్, నారాయణ, గుర్నులె మెంగాజీ, శివరాం, అర్జున్ కుమార్, భీంరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వీవీలకు రూ.26వేలు వేతనం అందించాలి



వినతిపత్రం అందిస్తున్న ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి విద్యా వాలంటీర్లకు రూ.26వేల గౌరవ వేతనం అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతిని కలిసి వినతిపత్రం అందచేశారు. 15ఏళ్లుగా చాలీ చాలనీ వేతనాలతోనే పని చేస్తున్నారని, గౌరవ వేతనం రూ.5వేలు మాత్రమే అందిస్తుండడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యావాలంటీర్లు దుర్గం రమేష్, స్వప్న, సింధూజ పాల్గొన్నారు.

నగదు పట్టివేత



పంచనామా చేస్తున్న అధికారి, ఎస్‌హెచ్ఓ

బెల్లంపల్లి: పట్టణంలో కాంటా చౌరస్తా వద్ద పోలీసుల తనిఖీలో గురువారం నగదును పట్టుకున్నారు. లలిత్‌కుమార్ జవార్ వద్ద ఉన్న రూ.4.61 లక్షల నగదు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. ఆ డబ్బులను ఎన్నికల ఎఫ్ఎస్‌టీ అధికారులకు అప్పగించగా సీజ్ చేశారని వన్‌టౌన్ ఎస్‌హెచ్ఓ బన్సీలాల్ ప్రకటించారు. వన్‌టౌన్ ఎస్సై విక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్ వద్ద జాతీయ రహదారిపై సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మహారాష్ట్రలోని రాజూర నుంచి మంచిర్యాల వెళ్తున్న వాహనంలో రూ.1.98 లక్షల నగదు పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఎలాంటి ఆధార పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేశామని పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని ఏసీసీ డీమార్ట్ చౌరస్తా సమీపంలో వెంకటస్వామి..హోటల్ ముసుగులో మద్యం అమ్ముతున్నారని సమాచారంతో గురువారం దాడి చేసినట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు. రూ.15 వేల విలువ గల మద్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పట్టుబడిన నగదుతో సీఐ శ్రీనివాస్

మద్యం బాటిళ్లు పట్టివేత

బెల్లంపల్లి: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న ఓ కిరాణ షాపు లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్ఓ బన్సీలాల్ తెలిపారు. బెల్టుషాపు నిర్వాహకుడు బోధకుంట గణేశ్ వద్ద 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నస్పూర్: హైదరాబాద్‌లో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం రవి కోరారు. గురువారం ఆయన సీసీసీలోని నర్సయ్య భవన్‌లో మహాసభల వాల్‌పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మహాసభలకు యువత, మేధావులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు ముత్తునూరి మహేశ్, పర్వ శ్రీనివాస్, విజయ్, దేవి పోచన్న, సురేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెల్లంపల్లి: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ బస్తీ శివారు ప్రాంతంలో గురువారం పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. పక్కా సమాచారంతోనే పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద రూ.750 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బస్తీ బంకర్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా బూడిదగడ్డ బస్తీకి చెందిన అమరదీప్‌ను గురువారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్ఓ బన్సీలాల్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి అతని వద్ద ఉన్న వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గిరిజనుడి అనుమానాస్పద మృతి



నగేశ్ (ఫైల్)

జన్నారం: పని కోసం బుధవారం ఉదయం యజమానితో వెళ్లిన గిరిజనుడు సాయంత్రం శవమై ఇంటికి వచ్చాడు. అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన మండలంలోని మొర్రిగూడ పంచాయతీ పరిధి గొండుగూడలో చోటు చేసుకుంది. మృతుడి భార్య ఆత్రం గంగజల, ఎస్సై సతీశ్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన ఇత్తినేని వెంకటేశ్ బుధవారం ఉదయం గొండుగూడలో ఆత్రం నగేశ్ (30) ఇంటికి వచ్చాడు. పత్తి చేనులో నీరు పెట్టేది ఉందని కూలికి రమ్మని బైక్‌పై తీసుకెళ్లాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆటోలో నగేశ్ మృతదేహంతో ఇంటికి వచ్చాడు. గంగజలతో మీ భర్త చనిపోయాడని వెంకటేశ్ చెప్పి వెళ్లిపోయాడు. ఎలా చనిపోయాడు, ఏమి జరిగిందో చెప్పకుండా మృతదేహాన్ని తీసుకురావడం పట్ల కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు. భార్య ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నారు.

లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు శుక్రవారం నాటికి లాభాల వాటా, దసరా అడ్వాన్స్ చెల్లించాలని, లేనిపక్షంలో 21న టోకెన్ సమ్మె చేస్తామని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య తెలిపారు. గురువారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ పేరుతో కంపెనీ కావాలనే జాప్యం చేస్తోందని ఆరోపించారు. యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కిషన్‌రావు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

బజార్‌హత్నూర్: మద్యానికి బానిసై యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన మడవి గోరక్‌నాథ్, పూర్ణబాయి దంపతుల రెండో కుమారుడు నగేష్(21) బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపం చెంది చేనులోకి వెళ్లి గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఘటన స్థలానికి చేరుకుని వెంటనే బజార్‌హత్నూర్ పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విగ్రహాలకు ముసుగు



వస్త్రంతో కప్పేసిన ఇందిరాగాంధీ విగ్రహం



బట్టతో చుట్టిన వెంకటస్వామి విగ్రహం



బట్టతో చుట్టి ఉన్న గుండా మల్లేశ్ విగ్రహం

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు బెల్లంపల్లిలో మూడు విగ్రహాలకు ముసుగేశారు. కొత్త మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న ఇందిరాగాంధీ, ఏఎంసీ చౌరస్తాలో ఉన్న గడ్డం వెంకటస్వామి, బజారుఏరియాలో గుండా మల్లేశ్ విగ్రహాల ముఖాలు కనిపించకుండా వస్త్రంతో కప్పేశారు.– బెల్లంపల్లి

వెలమల క్షేత్రం..!



మంచిర్యాల ముఖ చిత్రం

- జీసీలకు రెండేసార్లు అవకాశం
- కార్మిక, కర్షక ప్రాంతం


జీవీ సుధాకర్‌రావు


జీ.వీ.పితాంబర్‌రావు


కోదాటి రాజమల్లు


చుంచు లక్ష్మయ్య


మురళీమనోహర్‌రావు


గోనె హన్మంతరావు


గడ్డం అరవిందరెడ్డి


నడిపెల్లి దివాకర్‌రావు


కే.వి.కిషన్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల శాసనసభ నియోజకవర్గం వెలమలకు కంచుకోటగా ఉంటూ వస్తోంది. పునర్విభజనకు ముందు లక్సెట్టిపేట నియోజకవర్గంలో మొదటి నుంచీ అగ్రవర్ణాలకు అధికారం దక్కింది. కార్మిక, కర్షక ఓటర్లు ఎక్కువగా ఉన్నా రాజకీయ ప్రస్థానం అలాగే కొనసాగుతోంది. లక్సెట్టిపేట నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. ఇప్పటివరకు 16 సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గం నేతలే ఎక్కువ కాలం పాలించారు. 1952లో ద్విసభ్య నియోజకవర్గం కాగా.. సోషలిస్ట్ పార్టీ ప్రభావం ఉన్న రోజుల్లో ఆ పార్టీ తరఫున కోదాటి రాజమల్లు, విశ్వనాథం ఒకే పర్యాయం శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మంచిర్యాల నియోజకవర్గంగా ఆవిర్భవించింది. మొదటి ఎమ్మెల్యేగా గడ్డం అరవిందరెడ్డి టీఆర్‌ఎస్ నుంచి ఎన్నికయ్యారు. 2010 ఉప ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. 2014 సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ నుంచి నడిపెల్లి దివాకర్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

కీలక పదవులు

లక్సెట్టిపేట నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు కీలక పదవుల్లో కొనసాగారు. జేవీ.నర్సింగరావు పీసీసీ అధ్యక్షుడిగా, ఉప ముఖ్యమంత్రిగా, జీవీ.సుధాకర్‌రావు నీటి పారుదల, రవాణా, చక్కెర శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

విలక్షణ తీర్పు..

నియోజకవర్గ ప్రజలు విలక్షణమైన తీర్పునిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యే లేకపోవడం గమనార్హం. ఇప్పటివరకు జీవీ.పితాంబర్‌రావు, జీవీ.సుధాకర్‌రావు, జేవీ.నర్సింగరావు, దివాకర్‌రావు వరుసగా రెండేసి సార్లు ఎన్నికైనా మూడోసారి ఎన్నికై హ్యాట్రిక్ కొట్టే అవకాశం దక్కలేదు.

కార్మికులు, వ్యవసాయం

మంచిర్యాల నియోజకవర్గానికి తూర్పున సింగరేణి కార్మిక క్షేత్రం, పశ్చిమాన వ్యవసాయ క్షేత్రం ఉండగా, మధ్యలో మంచిర్యాల విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా ప్రత్యేకతను సంతరించుకుంది. ఏ ఎన్నికల్లో అయినా సింగరేణి క్షేత్రంలోని కార్మికులే నేతల రాతలు మారుస్తున్నారు. 10 వేల వరకు సింగరేణి కార్మిక కుటుంబాలు ఉండగా దాదాపు 45 వేలకు పైగా ఓటర్లు ఉంటారు. బీసీ ఓటర్లు కీలకంగా ఉన్నా చట్టసభకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కడం లేదు. 2.65లక్షల పైగా ఓటర్లు ఉండగా ఇందులో దాదాపు రెండు లక్షల వరకు బీసీ ఓటర్లు ఉంటారు.

నియోజకవర్గ స్వరూపం

నియోజకవర్గంలో మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీలు, హాజీపూర్, దండేపల్లి మండలాలు ఉన్నాయి. 2,64,515 మంది ఓటర్లు ఉన్నారు. మున్నూరు కాపు, పెరిక ఓటర్ల ప్రాతినిధ్యం అధికంగా ఉండగా ఆ తర్వాత వరుసలో ఎస్సీ, ఎస్టీలు, ముస్లిం మైనారిటీ, బెస్త, వైశ్య, పద్మశాలి, రెడ్డి, వెలమ, ఎల్లాపు ఇతర కులాల వారు ఉంటారు.

ఉప ఎన్నికలు ఇలా..

1973లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న జేవీ.నర్సింగ్‌రావు అకాల మరణంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో మందమర్రికి చెందిన న్యాయవాది కేవీ.కిషన్‌రావు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985లో ఎన్టీ రామారావు ప్రభుత్వం రద్దు కావడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి 2010లో టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఉప ఎన్నికల్లో అరవింద్‌రెడ్డి 86 వేల ఓట్ల పై చిలుకు మెజారిటీతో విజయం సాధించారు.

ఎన్నో ప్రత్యేకతలు..

మంచిర్యాల గోదావరి పరీవాహక ప్రాంతం ఉంది. తూర్పున శ్రీరాంపూర్‌లో నల్ల బంగారం నిక్షిప్తమైన సింగరేణి భూగర్భ, ఉపరితల(ఓపెన్ కాస్ట్) గనులు ఉన్నాయి. మంచిర్యాలలో ఎంసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ, పరిసర ప్రాంతాల్లో సిరామిక్ పరిశ్రమలు ఉన్నాయి. ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్ట్ ఉంది. లక్సెట్టిపేటలో రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద చర్చి సీఎస్ఐ చర్చి ఉంది. దండేపల్లిలో చిన్నయ్య, పెద్దయ్య గుట్టలతో పాటు చప్పట్లతో జాలువారే నీటి ఊటలు ప్రత్యేకత.

లక్సెట్టిపేట నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు..

ఎమ్మెల్యే	పదవీ కాలం	పార్టీ
విశ్వనాథరావు, కోదాటి రాజమల్లు	1952-57	సోషలిస్టు పార్టీ
జీవీ.పితాంబర్‌రావు	1957-62	కాంగ్రెస్
జీవీ.పితాంబర్‌రావు	1962-67	స్వతంత్ర
జేవీ.నర్సింగరావు	1967-72	కాంగ్రెస్
జేవీ.నర్సింగరావు	1972-73	కాంగ్రెస్
కేవీ.కిషన్‌రావు(ఉప ఎన్నిక)	1973-77	కాంగ్రెస్
చుంచు లక్ష్మయ్య	1977-83	జనతా పార్టీ
ఎం.మురళీమనోహర్‌రావు	1983-85	టీడీపీ
జీవీ.సుధాకర్‌రావు(ఉప ఎన్నిక)	1985-89	స్వతంత్ర
జీవీ.సుధాకర్‌రావు	1989-94	కాంగ్రెస్
గోనె హన్మంతరావు	1994-99	టీడీపీ
నడిపెల్లి దివాకర్‌రావు	1999-04	కాంగ్రెస్
నడిపెల్లి దివాకర్‌రావు	2004-09	కాంగ్రెస్
మంచిర్యాల నియోజకవర్గంలో...		
గడ్డం అరవింద్‌రెడ్డి	2009-10	టీఆర్‌ఎస్
గడ్డం అరవింద్‌రెడ్డి(ఉప ఎన్నిక)	2010-14	టీఆర్‌ఎస్
నడిపెల్లి దివాకర్‌రావు	2014-18	టీఆర్‌ఎస్
నడిపెల్లి దివాకర్‌రావు	2018-23	బీఆర్‌ఎస్

బాసరలో నేడు మూల నక్షత్ర పూజలు


ముస్తాబైన సరస్వతీ ఆలయం

- అధికసంఖ్యలో రానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


బాసరకు పాదయాత్రగా వస్తున్న కామోల్ భక్తులు

భైంసా: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బాసరలో శుక్రవారం విశేష మూల నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించనున్నారు. పూజల్లో పాల్గొనేందుకు భక్తులు అధికసంఖ్యలో రానుండడంతో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈవో విజయరామారావు ఇప్పటికే అర్చకులు, సిబ్బందితో సమీక్షలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. శుక్రవారం జ్ఞానసరస్వతీ అమ్మవారి సన్నిధిలో నిర్వహించనున్న అక్షర శ్రీకార పూజలు, అభిషేక పూజల కోసం టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కాగా, మూల నక్షత్రం రోజున పలు ప్రాంతాల నుంచి భక్తులంతా పాదయాత్రగా బాసరకు వస్తుంటారు. ఒకరోజు ముందే చేరుకుని అమ్మవారి ఆలయంలో బసచేస్తారు. మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుంటారు. భైంసా మండలం కామోల్ గ్రామానికి చెందిన భక్తులు ఐదేళ్లుగా పాదయాత్రగా బాసరకు వస్తున్నారు. ఈసారి కూడా పాదయాత్ర ప్రారంభించారు. కాగా, దసరా ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలో ఉండి ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకుంటామని ఆ గ్రామానికి చెందిన గంగారెడ్డి తెలిపారు. ఐదేళ్లుగా భక్తులమంతా కలిసి పాదయాత్రగా బాసరకు చేరుకుంటున్నట్లు చెప్పారు.

అక్రమ మద్యాన్ని కట్టడి చేయాలి


అధికారులతో సమీక్షిస్తున్న నర్సింహారెడ్డి

- ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి
- అంతర్రాష్ట్ర అబ్కారీ అధికారులతో సమీక్ష

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యాన్ని పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని ఎక్సైజ్‌శాఖ డెప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో మహారాష్ట్ర, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ అక్కడి నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలోకి మద్యం రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రత్యేక తనిఖీ బృందాలతో నిరంతర నిఘా ఉంచాలన్నారు. సమాచారం అందిన వెంటనే అధికారులకు చేరవేయాలన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేసి వారిపై నిఘా పెట్టాలన్నారు. కొత్తగా చెక్‌పోస్ట్ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్, అమరావతి, యావత్‌మాల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు నితీష్ షిండే, పాటిల్ సంజయ్, షేర్ సాగర్, పాంధ్రకవడ, రాజురా సీఐలు జయంత్, తండ్వే, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్లు హిమశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, నందగోపాల్, జ్యోతి కిరణ్, ఆదిలాబాద్ సీఐ శ్రీనివాస్, అధికారులు సమ్మయ్య, మోయిన్ అలీ, రాజేశ్‌కుమార్, మిలేష్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

- పోలీసుల అదుపులో 42 మంది
- రూ.2.51 లక్షలు, 12, కార్లు, 43 సెల్‌ఫోన్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కార్లు


స్వాధీనం చేసుకున్న నగదు

చెన్నూర్: చెన్నూర్ సమీపంలోని గోదావరి నది ఒడ్డున గురువారం తెల్లవారుజాము పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతోనే దాడి చేసి 42 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.51 లక్షల నగదు, 43 సెల్‌ఫోన్లు, 12 కార్లు, 2 చార్జింగ్ లైట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ వాసుదేవరావు తెలిపారు. వీరంతా గోదావరిఖని, ఎన్టీపీసీ, రామగుండం, బెల్లంపల్లి, మందమర్రి, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన వారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పేకాట స్థావరాలు మార్చుకుంటూ..

వివిధ ప్రాంతాల్లో కొందరు రాత్రివేళ పేకాట ఆడుతున్నారు. పోలీసు నిఘా ఉన్న ప్రాంతాలను గమనించి పేకాట స్థావరాలను మార్చుకుంటున్నారు. గతేడాది మహారాష్ట్రలో పేకాట ఆడి తిరుగుప్రయాణంలో కోటపల్లి మండలం రాపన్‌పల్లి మీదుగా వస్తున్న మూడు కార్లను పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణలోని జిల్లాలోనే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లి పేకాట ఆడుతున్నారని సమాచారం.

యోగా పోటీల విజేత 'కరీంనగర్'


కరీంనగర్ క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న చైర్మన్ రవీందర్ సింగ్


రెండో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టు

- తొమ్మిదోసారి విజయంతో జిల్లా జట్టు రికార్డు
- ట్రోఫీలు అందించిన రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ రవీందర్ సింగ్
- ముగిసిన 10వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు


మూడో స్థానంలో నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ ఆవిర్భావం నుంచి 10 (ఒకసారి కరోనా కారణంగా పోటీలు జరగలేదు) సార్లు రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. వరుసగా 9 సార్లు కరీంనగర్ జట్టే విజేతగా నిలిచింది. రెండు రోజులపాటు కరీంనగర్ పద్మనగర్‌లోని మానేర్ సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి యోగా గురువారం ముగిశాయి. కరీంనగర్ జట్టు మొత్తం 34 పాయింట్లతో చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా జట్టు క్రీడాకారులు 22 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో, మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 16 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచింది. ఆయా జట్లకు రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ రవీందర్ సింగ్ ట్రోఫీలు అందజేశారు.

జాతీయ పోటీల్లో పతకాలు సాధించాలి

రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న యోగా క్రీడాకారులు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ రవీందర్ సింగ్ అన్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కరీంనగర్‌లో జాతీయస్థాయి యోగా పోటీలు నిర్వహించే అవకాశం వస్తే సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్యాట్రన్, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా జరిగాయన్నారు. యోగా సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు జె.మనోహర్ కుమార్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను నవంబర్ 23 నుంచి 26 వరకు గౌహతిలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, యోగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, యోగా సంఘం బాధ్యులు కమలాకర్, బాలరాజు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరుస చాంపియన్‌షిప్‌లు..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొమ్మిది సార్లు వరుసగా చాంపియన్‌షిప్‌లు సాధించి, కరీంనగర్ జట్టు సరికొత్త రికార్డు సృష్టించింది. 2014లో మహబూబ్‌నగర్, 2015లో నిజామాబాద్, 2016లో ఆదిలాబాద్, 2017లో కరీంనగర్, 2018లో పెద్దపల్లి, 2019లో సరూర్‌నగర్, 2021లో కరీంనగర్, 2022లో రాజన్న సిరిసిల్ల, తాజాగా కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో చాంపియన్‌గా నిలిచింది.

రజత పతకం సాధించా



రాష్ట్రస్థాయి పోటీల్లో నేను 18-21 విభాగంలో పోటీపడ్డాను. రజత పతకం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. మూడుసార్లు జాతీయ స్థాయికి వెళ్లాను. ఈసారి పతకం సాధించేందుకు బాగా ప్రాక్టీస్ చేస్తా.

– ఎం.వెంకటేశ్, సూరారం

జాతీయ పోటీల్లో పతకమే లక్ష్యం



జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవడం సంతోషంగా ఉంది. గతంలో రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 18-21 విభాగంలో రజతం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ పతకం సాధించడమే లక్ష్యం.

– ఎస్.శ్రీనిధి, మల్లాపూర్

ఫస్ట్ టైమ్ ఎంపికయ్యాను



నేను ఇప్పటివరకు రెండు సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఫస్ట్ టైమ్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. 8-10 విభాగంలో కాంస్య పతకం సాధించి, జాతీయ పోటీలకు సెలెక్ట్ అయ్యాను. అక్కడ పతకం సాధించాలని ఉంది.

– జి.మన్విత్ రామ్, కరీంనగర్

ముగిసిన రాష్ట్రస్థాయి వ్యవసాయ పాలిటెక్నిక్ క్రీడలు


పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన జగిత్యాల జట్టు


బాలబాలికల విభాగంలో ప్రతిభ చూపిన మధిర జట్టు

- బాలుర విభాగంలో ఓవరాల్ చాంపియన్ పాలెం జట్టు
- బాలికల విభాగంలో ఓవరాల్ చాంపియన్ తోర్నాల జట్టు
- బాలబాలికల విభాగంలో మధిర జట్టు ప్రతిభ


మాట్లాడుతున్న వ్యవసాయ వర్సిటీ అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లాకేంద్రంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా వ్యవసాయ వర్సిటీ ఉన్నతాధికారులు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందించారు.

బాలుర విభాగంలో పాలెం జట్టు

బాలుర విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా నాగర్‌కర్నూల్ జిల్లాలోని పాలెం జట్టు సాధించింది. ఈ జట్టు షాట్‌పుట్, జావలిన్ త్రో, లాంగ్ జంప్, టేబుల్ టెన్నిస్‌లో ప్రథమస్థానంలో నిలిచింది. డిస్కస్‌త్రో, షటిల్, బ్యాడ్మింటన్, 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్ విభాగాల్లో రెండోస్థానం సాధించింది. చెస్, 4 మీటర్ల రిలే విభాగంలో మూడో బహుమతి సాధించారు. బాలికల జట్టు టేబుల్ టెన్నిస్‌లో రెండోస్థానం, 100 మీటర్లు, 4 మీటర్ల రిలే విభాగంలో మూడో బహుమతి, క్విజ్, పాటల పోటీల్లో రెండోస్థానం, ముగ్గుల పోటీల్లో రెండో స్థానం, పాటల పోటీలో మొదటి స్థానంలో నిలిచింది.

బాలికల విభాగంలో తోర్నాల జట్టు

బాలికల విభాగంలో సిద్దిపేట జిల్లాలోని తోర్నాల జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించింది. త్రోబాల్, టెన్నికాయిట్, లాంగ్‌జంప్‌లో మొదటి బహుమతి, బ్యాడ్మింటన్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్, 400 రిలే పరుగు పందెంలో రెండో బహుమతి సాధించారు. బాలుర విభాగంలో 400 మీటర్ల రిలేలో మొదటి బహుమతి, జావెలిన్ త్రో, 200మీ రన్నింగ్‌లో మూడో స్థానం సాధించారు.

బాలబాలికల విభాగంలో మధిర జట్టు

బాలురు, బాలికల విభాగంలో మధిర జట్టు ప్రతిభ కనబరించింది. బాలుర విభాగం షాట్‌పుట్‌లో రెండో బహుమతి, క్విజ్‌లో మూడో బహుమతి సాధించింది. బాలికల విభాగంలో చెస్‌లో రెండో బహుమతి, లాంగ్‌జంప్‌లో మూడోస్థానం, వ్యాసరచన పోటీల్లో మొదటి, క్విజ్‌లో మూడోస్థానం, సోలో డ్యాన్స్‌లో మొదటి స్థానం, గ్రూప్ డ్యాన్స్‌లో మొదటి స్థానం, కల్చరల్, లిటరరీ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది.

పలు విభాగాల్లో ఆతిథ్య జట్టు ప్రతిభ

ఆతిథ్య జగిత్యాల జట్టు పలు విభాగాల్లో ప్రతిభ చాటింది. బాలికల విభాగంలో క్యారమ్స్, టెన్నికాయిట్, 200 మీటర్ల రన్నింగ్ డ్యాన్స్‌లలో రెండో బహుమతి, బ్యాడ్మింటన్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్, రంగోళిలో మొదటి బహుమతి సాధించారు. బాలుర విభాగంలో బ్యాడ్మింటన్, ఉపన్యాస పోటీలో మొదటి బహుమతి, టేబుల్ టెన్నిస్, లాంగ్‌జంప్‌లో రెండో బహుమతి పొందారు.

నైపుణ్యాలు ఉంటేనే గుర్తింపు

విద్యార్థి దశ నుంచే నైపుణ్యంపై దృష్టి సారించాలని, అప్పుడే గుర్తింపుతోపాటు ఉపాధి లభిస్తుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ డీన్ డాక్టర్ సీమా అన్నారు. క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. చదవు, ఉన్నత ఉద్యోగం మాత్రమే జీవితానికి సరిపోదని, సంస్కారంతోపాటు అదనపురంగంలో ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. స్థానిక పాలిటెక్నిక్ డైరెక్టర్ పద్మజ మాట్లాడుతూ వ్యవసాయ కోర్సులతో ఉపాధి పొందడంతోపాటు రైతులకు సేవ చేయాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని వ్యవసాయ వర్సిటీ క్రీడల పరిశీలకులు సురేష్ అన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడలను చాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతినారాయణ్ భట్ మాట్లాడుతూ క్రీడల్లో మరింతగా రాణించేందుకు రాష్ట్ర స్థాయి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ వేళ.. రైళ్లు కిటకిట



రామగుండం: బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని హైదరాబాద్ నుంచి వచ్చే రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి కాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, చంద్రాపూర్, బల్లార్షా వైపు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో బోగీల్లో నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. దసరా నాటికి మరింత పెరిగే అవకాశం ఉంటుందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

స్కందమాతగా అమ్మవారు



ధర్మపురి: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం స్కందమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధమైన రామలింగేశ్వరస్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఐదోరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపురంగు చీరలో అలంకరించారు. పట్టణంలోని న్యూ టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గా సేవాసమితి మహా అన్నదానం చేపట్టింది.